**కథ**




రమితకు నెలతప్పినపుడు మహంత్ చాలా ఆనందించాడు. ఎవరో రమిత నెల తప్పితే మహంత్ కెందుకు ఆనందం? అనిపించవచ్చు? ఆమె మహంత్ బెటర్ హాఫ్. లేడీ డాక్టర్ కన్‌ఫర్మ్ చేసిన న్యూస్ ఆమె ఫోన్‌లో చెప్పినపుడు తన తేజం ఆమె గర్భంలో పెరుగుతున్నందుకు చాలా సంతోషిం చాడు. మహంత్ ఒక ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ ఆఫీసరు. ఊళ్లు తిరిగే జాబ్ అతనిది. నెలలో సగం రోజులు క్యాంపులో వుంటాడు. రమిత ప్రెగ్నెంటు. ఆమె ఆలన పాలన చూచుకొనేందుకు ఇన్నాళ్లు అత్తయ్య తమతోవుండేది. ఓ పెద్దదిక్కు ఇంట్లో వుంటే ఆ సులువేవేరు. రమితకు నెలలు నిండాయి. మంచిరోజు చూసి మామయ్య, అత్తయ్యను రమితను కాన్పుకు అనకా పల్లి తీసుకువెళ్లాడు. లేడీ డాక్టరు డెలివరీ తేదీ కూడా ఇచ్చారు. నేడోరేపో డెలివరీ అయ్యే అవకాశం!

తన కాంపింగ్‌లో చిన్న బ్రేక్! అయినా రేపు ఆఫీసులో అర్జంటుగా రిపోర్ట్ చేయవలసి వుండటంతో అనకాపల్లి వెళ్లలేకపోయిన పరిస్థితి. ఇపుడు యింట్లోనే ఉన్నాడు. అతనికి న్యూస్ అంటే చాల ఇష్టం. నాలుగైదు వార్తా పత్రికలు కొని చదవడం, అలా చదవడంతో కరెంట్ అఫైర్స్ తెలియడం అతను ఆనందించే ఎన్నో విషయాలలో ముఖ్యమైనది. ఓ న్యూస్ ఛానల్ చూస్తున్నాడు. సాయంత్రం నాలుగు గంటల

గోపాలుని రఘుపతిరావు

# ఎవరి స్వార్థం వారిది



సమయం! టీవీ చూస్తున్నప్పటికీ రమిత గురించే ఆలోచనలు! అంతలో ఓ వార్తా ఛానల్ ఫ్లాష్ న్యూస్ టీవీకాస్ట్ ప్రారంభించింది. బొంబాయినగరంలో భారీ విస్ఫోటనం! పాతిక మందిదాకా పోయారు. అదే సంఖ్యలో చిన్నా చితకా గాయలయిన క్షతగాత్రులు! ఆవార్త అతని మనసు కలచివేసింది. ఆ సంఘటన శత్రుదేశానికి చెందిన ఓ నిషేధిత ఉగ్రవాద సంస్థ చర్యగా అభివర్ణించారు అధికారులు. మృతి చెందిన వారి దేహాలను మార్చురీలోకి తరలించారు. గాయపడినవారిని అంబులెన్సులలో ఆసుపత్రులకు తరలించారు. యావత్ దేశంపై ప్రభావం చూపిన దురదృష్టకర సంఘటన అది.


అదేవార్త పదేపదే చూస్తున్న మహంత్ న్యూస్ ఛానల్ వారికి చేతినిండా పనిదొరికింది. మొదట ఫ్లాష్ అయినప్పటి ఉత్కంఠ ఇప్పుడు లేదు. దేశంలోని ముఖ్యనగరాలు, పట్టణాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యాలు ప్రసారమవుతున్నాయి. హోటల్‌లో భోంచేసి వచ్చిన మహంత్ బెడ్ పై మేను వాల్చాడు. అంతలో అతని మొబైల్ రింగయింది. కాల్ ఎక్కణ్నుంచా అని చూశాడు. జగన్నాథంగారి నుంచి! ఆయన మహంతు మామగారు. రమితకు లేబర్ పెయిన్స్ వస్తున్నాయట. పరిస్థితి అంచనా వేసిన లేడీ డాక్టరు, గర్భంలో బిడ్డ పొజిషన్ సరిగాలేదనీ, అష్యూరెన్స్ యివ్వలేమనీ సిజేరియన్ చేయాలనే చెప్పారట! అదే కాల్ సారాంశం!


మహంతు కలత చెందాడు. రమిత అంటే తనకు చాలప్రేమ. ఆమెకు కష్టం కలిగితే సహించలేడు. తమకు కలగ బోయే బిడ్డను క్రమశిక్షణతో పెంచి, చదివించి తనలాగా కష్టపడకుండా సివిల్స్ చేయించాలనేది ఇద్దరి ఆకాంక్ష! డబ్బుకు ఇబ్బందిలేకపోయినా ఊళ్లుపట్టుకు తిరిగే జాబ్ తనది. ఇద్దరూ కలిసి గడిపే సమయం తక్కువ. తమ పిల్లలకు అలా కాకూడదు. ఆ కల చెదిరే సూచన కనిపించడంతో భయం ఆవరించింది. రమితకూ బిడ్డకూ ఏమీకాకుడదు. ఇలా ఆలోచించసాగాడు.


మహంత్ బెడ్‌పై పడుకొని కళ్లుమూసుకున్నాడు. రెప్పలు బరువెక్కుతున్నాయి. అయినా నిద్రరావటం లేదు. లేచి టీవీ ఆన్ చేసి కుర్చీలో కూర్చున్నాడు. సమయం అర్థరాత్రి దాటింది. మరొక న్యూస్ ఛానల్‌తో ఎక్స్‌ప్లోజనుకు సంబంధించి అధికారాలు, ప్రజాప్రతినిధులతో విశ్లేషణ జరుగుతుంది. అప్పుడప్పుడు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాజకీయనాయకులు సందర్శించి పరామర్శిస్తున్న దృశ్యాలు ప్రసారమవు తున్నాయి. సీఎం గారు మృతుల కుటుంబాలకు పెద్ద మొత్తంలో ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

మామయ్య గారి నుంచి కాల్! 'మహీ! రమితను ఆపరేషనుకు సన్నధం చేశారు. డాక్టర్లు పరిస్థితి వివరంగా చెప్పటంలేదు'' ఆయన స్వరంలో దాచుకున్నా దాగని బాధ!

వెంటనే బయలుదేరి వస్తానన్న మహంత్‌తో, రేపు అర్జంటుగా ఆఫీసులో రిపోర్టు చేయవలసి వుందికదా? మీరు వెంటనే బయలుదేరి వచ్చి చేయగలిగింది ఏమీ లేదుకదా?! మంచి హాస్పిటల్‌లో జాయిన్ చేశాం! పరిచయస్తులయిన ఫామిలీ డాక్టరు. ఏం భయంలేదు. అన్నీ నేను చూసుకుంటాను!' అని జగన్నాథంగారు భరోసా ఇవ్వడంతో మహంత్ మౌనంగా వుండిపోయాడు. మహంత్ ఆలోచనలన్నీ భార్యచుట్టూ, ఇంకా జన్మించని బిడ్డ చుట్టూనే తిరుగుతున్నాయి. భగవంతుడు ఆ బిడ్డకు పుట్టక మునుపే కష్టాలు రాసిపెట్టాడా? రమిత ఎంత బాధ పడుతోందో? మహంతు తెరలు తెరలుగా దుఃఖం ఆవరించింది. టీవీలో దృశ్యాలు మసగ్గా కనిపిస్తున్నాయి. బాంబ్ బ్లాస్ట్ బాధితుల కష్టాల పరంపరలోని విషాదాలుభూతి అనుభవంలోకి







వస్తోంది. బోర్ కొట్టిన విస్ఫోటన విషాద దృశ్యాలు రిపీట్ అవుతున్నవి చూస్తున్నాడు. బాధితుల సమీప బంధువులు, స్నేహితులు ఎంతగా దుఃఖిస్తూ ఉండి వుంటారో ఊహ కందుతోంది. రమిత గురించి, ఇంకా రూపు తెలియని బిడ్డ గురించిన చింత తనను ఇంత బాధి స్తుంటే మృతి చెందిన, గాయపడిన వారి ఆప్తుల శోకం గురించి ఆలోచించిన మహంతు మనస్సు రోదించింది.

బాధితుల విషాదంలో పాలు పంచుకున్నాడు. విధిని నిందించాడు. ఉగ్రవాద భూతం చేస్తున్న అఘాయిత్యాలకు ఆవేశం కట్టలు తెంచుకుంది. అంతలో అతని ఆలోచనల్ని బ్రేక్ చేస్తూ మరోసారి మొబైల్ రింగయింది...! అది మామయ్య కంఠస్వరం. "గుడ్ న్యూస్ మహీ! ఆపరేషన్ విజయవంతమయింది. బాబుపుట్టాడు. రమిత మనవడు కూడా క్షేమంగా మనకు దక్కారు. అదృష్టం మనందరిదీనూ..."

మహంత్ శ్రవణేంద్రియాలలో సుస్వరాల ఆనందవీచికలు వీచాయి. తను వింటున్నది కలోనిజమో తేల్చు కోలేక పోయాడు. అదే అడిగాడు మామగారిని.

'నిజమే మహీ!...నీవు వింటున్నదీ, నేను చెబుతున్నదీ నిజం! రమిత, మనవడు క్షేమంగా వున్నారు. కొద్దిసేపట్లో అమ్మాయితో మాట్లాడవచ్చు..! అన్నారాయన. సెల్ అత్తయ్య అందుకొన్నారేమో, ఇప్పుడు స్వరం!

"మహీ! మనవడు అచ్చు నీపోలికే తెలుసా?! అమ్మాయి మగతగా మత్తులో వుంది. బాబు కులాసాగా వున్నాడు. డాక్టరుగారికి మనఫామిలీ అంతారుణపడి వుంది."

మహంత్‌కు అనుకోని ఆనందం కారణంగా గాలిలో తేలిపోతున్న అనుభూతి కలిగింది. ప్రమాదవశాత్తు లోత యిన గుంటలో పడిన అభాగ్యునికి ఎవరో సహాయం అందిచగా బయట పడి గుండెలనిండా ప్రాణవాయువు పీల్చుకుని ఆనందాన్ని అనుభూతించిన అనుభవం పొందాడు మహంత్!

రేపు ఆఫీసులో ముఖ్యంగా చేయవలసిన పనులు వున్నా భార్యాబిడ్డల్ని ఎప్పుడెపుడు చూద్దామా అని మనసు ఉవ్విళ్లూరుతోంది. మనసు నిలవడంలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు అనకాపల్లి వెళదామా అని ఆతృత! బాస్‌కు తనుసిక్ అయినట్లు సెలవు అర్థిస్తూ ఓ ఈ-మెయిల్ పంపి ప్రొద్దున్నే అనకాపల్లి ప్లాన్ చేశాడు.

రేపు ఆఫీసులో ముఖ్యంగా చేయవలసిన పనులు వున్నా భార్యాబిడ్డల్ని ఎప్పుడెపుడు చూద్దామా అని మనసు ఉవ్విళ్లూరుతోంది. మనసు నిలవడంలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు అనకాపల్లి వెళదామా అని ఆతృత! బాస్‌కు తనుసిక్ అయినట్లు సెలవు అర్థిస్తూ ఓ ఈ-మెయిల్ పంపి ప్రొద్దున్నే అనకాపల్లి ప్లాన్ చేశాడు.

"ఇంకా తెలవారదేమి, ఈ చీకటివిడిపోతేమి?" మధురమయిన పాతసినిమా పాట గుర్తుకొస్తోంది. టీవీ ఆఫ్ చెయ్య కుండా మంచంపై వాలాడు. న్యూస్ ప్రసారాలు వస్తూనే వున్నాయి. నిన్నటి బ్లాస్ట్ దృశ్యాలు రిపీట్ అవుతునే వున్నాయి. మహంత్ కళ్లు మూసుకొని న్యూస్ వింటూనే వున్నాడు. అయితే తమాషాఏమిటంటే, ఇందాకటి విషా దానుభూతి అతనిలో ఇప్పుడు కనిపించడంలేదు. అంబులెన్సులు గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించే దృశ్యాలు, అక్కడ చికిత్స, నాయకుల పరామర్శ చిత్రంగా మహంత్‌లో ఎలాంటి ప్రభావం చూపలేకపోతున్నాయిప్పుడు. కొద్దిగా కళ్లు తెరిచి, లేచే ప్రయత్నం చేయకుండానే రిమోట్‌తో ఓ మ్యూజిక్ ఛానల్ ట్యూన్ చేశాడు. యువతను ఉర్రూతలూగించే ప్రేమగీతాలు వస్తున్నాయి. కళ్లుమూసుకొని ఎడ మవైపుకు వత్తిగిలి పడుకు న్నాడు. చలిగా వుందేమో ఓ పలుచటి రగ్ ఛాతీదాకా కప్పుకొని మంద్ర స్థాయిలో సంగీతం వింటూ కునుకు తీశాడు. బ్రాహ్మీకాల సుషుప్తి అది. మహంతుకు చాలానే కలలు వచ్చాయి. టీవీ నుంచి వినబడుతున్న గీతాలకు అను గుణంగా పగటికలల్లాంటి ఆ స్వప్నాలలో సీన్‌లూ, సీక్వెన్సులూ మారుతున్నాయి.

తెల్లవారింది. కాలకృత్యాలు తీర్చుకున్నాడు. డ్రస్ చేసుకొని ఓ సూట్ కేసు సర్దుకొని సికింద్రాబాద్ స్టేషనులో ఓ రైలెక్కాడు. రమిత, చిన్నారి బాబు కళ్లలో మెదులుతున్నారు. వారిని ఎప్పుడు చూస్తానా అని హృదయం గాఢంగా స్పందిస్తోంది.

ఈ స్పందన నిన్న పేలుళ్లలో మరణించిన, గాయపడిన దురదృష్టవంతుల పట్ల కలగటం లేదు మహంతులో. అదేమి చిత్రమోమరి! మహంత్ లాంటి సామాన్య ప్రజల మనస్తత్వమంతేనేమోమరి! ఎవరి హడావిడీ, ఎవరి స్వార్థం వారిది.

తెలతెలవారుతున్న ప్రశాంత వాతావరణం అది.

పక్షులు కిలకిలా రావాలు చేస్తున్నాయి.

మనిషి లోని స్వార్థగుణాన్ని అవి ఎద్దేవా చేస్తున్నాయా? అన్నట్లు కఠిన కలస్వనాలు!

గుంపులుగా గుంపులుగా ఎగురుతున్న పక్షులను కిటికీ లోనుంచి చూస్తున్నాడు నిర్వికారంగా! అతనిలో తనవారిపై మమకారం పొంగువారుతోంది తప్పించి ప్రేలుళ్లు సృష్టించిన బీభత్సం ఏ మాత్రం మనసు తెరపై కద లాడటం లేదు. మనిషికి తన సుఖం, తన కష్టమే ముఖ్యం.

ఎదుటివారి కష్టసుఖాలతో పనిలేదు. మహాను భావులయిన వారి విషయంలో మినహాయింపు వుంటుందేమో కానీ, సామాన్యుడు ఇంతేనేమో?!

ఎవరి స్వార్థం వారిది! మనిషి స్వార్థ జీవి మరి!!

## జీతం

"ఏంటీ, ఈ నెల పనిమనిషికి నువ్వు జీతమిస్తున్నావే!?" అడిగాడు, భర్త.

"పక్కింటావిడ వజ్రాల కమ్మలు కనిపిం చటం లేదనే శుభవార్త చెప్పిందిగా!"



## తాళం చెవి

"ఇదిగో హెడ్డూ, ఫోన్ చేసిందెవరయ్యా? అలా తిడుతున్నా వేంటి?"

"ఎవడో తెలియటం లేదు సార్, ఇంటి తాళం చెవి పోయిందిట, గంగులును తాళం పగలగొట్టేందుకు పంపించగలరా అనడుగుతున్నా డండీ!"